క్లుప్తంగా

రహదారి భద్రతపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులు హోండా కంపెనీ ప్రతినిధి ఫణికుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. హెల్మెట్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు మైనార్టీ తీరని తమ బిడ్డలకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ వర్ధంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ రామానుజన్ కనిపెట్టిన గణిత సూత్రాలు, సిద్ధాంతాలు ఎంతో మేలు చేశాయన్నారు. విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



ఆగిరిపల్లి: పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు సాధించిన ఆరుగురు ముస్లిం విద్యార్థులను శుక్రవారం మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మక్కా మసీదులో సత్కరించి, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. వీరికి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తామని మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ గౌస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యులు షేక్ సుభాని, మక్కా మసీద్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ హక్, షేక్ సాధిక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఇబ్రహీంపట్నం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యువకుడు ఎన్టీటీపీఎస్ వేడినీటి కాలువ వద్ద ఆత్మహత్యకు యత్నించాడు. ఆ యువకుడిని స్థానిక పోలీసులు చాకచక్యంగా కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రింగ్ సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న యువకుడు సుభాష్ కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఎన్టీటీపీఎస్ కాలువ వద్ద అనుమానాస్పదంగా కనిపించాడు. ఈ విషయాన్ని అటుగా వెళుతున్న వాహనదారులు పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అందుబాటులో ఉన్న ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ జగదీష్ కాలువ వద్దకు చేరుకుని కాలువలో దూకేందుకు సిద్ధంగా ఉన్న సుభాష్‌ను రక్షించారు. స్టేషన్‌కు తీసుకువెళ్లి అతని వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం ఆయనను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తిరువూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, ఫన్నీ మ్యాథ్స్, ఇంద్రజాల ప్రదర్శన తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, సభ్యులు రాంప్రదీప్, సుబానీ, పాపారావు, సుధాకర్, సైదులు, ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. సారా తయారుచేసే దరావతు జ్యోతి పరారు కాగా కేసు నమోదు చేశామని చెప్పారు. గంపలగూడెంలో ఇనపనూరి వెంకటేశ్వర్లు వద్ద 40 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎ.కొండూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వడిత్యా బద్దు, రావుల కృష్ణను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓట్లు వేయండి

- వసంత ధన అహంకారాన్ని ఓటుతో అంతమొందించండి
- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలి
- వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు
- పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం



ప్రచారంలో భాగంగా వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న తిరుపతిరావు



వెల్లటూరు శివారులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సర్నాల నాగలక్ష్మి

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. జి.కొండూరు మండల పరిధి గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పార్టీ శ్రేణులు, ప్రజలు తిరుపతిరావుకు ఘన స్వాగతం పలికారు. తిరుపతిరావు మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో ఆరున్నర దశాబ్దాల రాజకీయ చరిత్రలో ఈ ఎన్నికలు అహంకారానికి, ఆత్మగౌరవానికి మధ్య పోటీగా జరుగుతున్నాయన్నారు. దిగుమతి నేతలంతా నియోజకవర్గంలో గెలుపొంది సహజ వనరుల దోపిడీకి పాల్పడటం మినహా స్థానిక ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని చెప్పారు. స్థానికులు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రతిసారి నియోజకవర్గానికి మేలు జరిగిందన్నారు. స్థానికుడనైన తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని చెప్పారు. టీడీపీ నాయకులు ఓటర్లను వెధవలంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా డబ్బులిచ్చి ఓటర్లను కొనుగోలు చేస్తామని వారు బహిరంగంగా స్టేట్‌మెంట్ ఇవ్వడం చూస్తే ఓటర్లను ఎంత చులకన భావంతో చూస్తున్నారో ఇట్టే అర్థమవుతోందన్నారు. డబ్బు అహంకారంతో పేట్రోగిపోతున్న వసంత వెంకట కృష్ణప్రసాద్‌కి ఓటు అనే ఆయుధంతో ప్రతి ఒక్కరూ బుద్ధి చెప్పాలన్నారు. తన వద్ద ఎటువంటి డబ్బులు లేవని, జగనన్న ఐదేళ్ల పాటు చేసిన మంచిని గుర్తించి అదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ని గెలిపించాలని కోరారు. అతి సామాన్యులను సైతం చట్ట సభలకు పంపాలన్న జగనన్న సంకల్పం నెరవేరే విధంగా ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తిరుపతిరావు సతీమణి నాగలక్ష్మి ప్రచారం..

సర్నాల తిరుపతిరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన భార్య నాగలక్ష్మి చిన్న నందిగామ, భీమవరప్పాడు, వెల్లటూరు గ్రామాలలో ప్రచారం చేశారు. ఆయా గ్రామాలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ సామాన్యుడిగా, మీలో ఒకడిగా ఉన్న వ్యక్తిని గెలిపించుకుంటే నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి వీలుంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడు సౌరభ్‌శర్మ తనిఖీలు



తిరువూరు సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సౌరభ్ శర్మ

తిరువూరు: ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్ శర్మ శుక్రవారం తిరువూరు సమీపంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా అనుమతికి మించి నగదు తీసుకు వెళ్లడం, మద్యం రవాణా చేయడం, విలువైన వస్తువులు, ఆభరణాలు తరలించడం వంటి వాటిని కట్టడి చేయడానికి ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టుల్లో 24 గంటలూ తనిఖీలు చేయాలని ఆయన ఆదేశించారు. అభ్యర్థులు ప్రచారానికి చేస్తున్న వ్యయం ఎప్పటికప్పుడు నమోదు చేయడం, వీడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరని తెలిపారు. తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దాఖలైన నామినేషన్లు, అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి కె. మాధవి, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ప్రజాదరణ

వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు



గంపలగూడెంలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నల్లగట్ల స్వామిదాసు

చింతలనర్వ(గంపలగూడెం): వైఎస్సార్ సీపీకి రాష్ట్రం వ్యాప్తంగా ప్రజాదరణ నానాటికీ పెరుగుతోందని తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలం చింతలనర్వ, చెన్నవరం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రజలు మంచి చేసే వారిని గుర్తించి ఆదరించాలన్నారు. అబద్ధం తప్ప నిజం చెప్పలేని నైజం టీడీపీ అధినేత చంద్రబాబుది అని చెప్పారు. టీడీపీ అభ్యర్థులను ఓటర్లు డిపాజిట్లు రాకుండా ఓడించాలన్నారు. ఇచ్చిన మాట తప్పడం తెలియని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో జరుగనున్న ఎన్నికల సందర్భంగా ప్రకటించే మేనిఫెస్టో మరింత ప్రజాదరణ పొందటం ఖాయమన్నారు.

టీడీపీకి భంగపాటు తప్పదు..

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు భంగపాటు తప్పదని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండలం తోటమూలలో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఎన్నికల్లో విజయంపై పగటి కలలు కంటున్నారని అన్నారు. ఎన్నికల్లో గంపలగూడెం మండలం నుంచి వైఎస్సార్ సీపీకి మెజారిటీ రావడం తథ్యం అని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం బూత్‌ల వారీగా మెజారిటీని ప్రకటించే సత్తా వైఎస్సార్ సీపీకి ఉందన్నారు. గడచిన ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధికి చేపట్టిన సంక్షేమ పథకాలు ఆయా వర్గాలకు చెందిన ప్రజలకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందాయని చెప్పారు. ఫలితంగా పేద ప్రజల గుండెల్లో జగనన్న నిలిచిపోయారన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని సగర్వంగా ప్రజలు చెప్పుకొంటున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలకు ఉన్న ప్రేమాభిమానాలను తీసివేయడం ఎవ్వరివల్ల కాదన్నారు. విభజన హామీలు అమలు చేయలేదని, ప్రత్యేక హోదా ఇవ్వలేదంటూ నిన్నటి వరకు ధర్మపోరాటం పేరుతో కుటిలపోరాటం చేసిన చంద్రబాబు ప్రసుతం ఏవిధంగా బీజేపీతో పొత్తుకు వెళ్లారని ప్రశ్నించారు. వారికి అధికార దాహం తప్ప ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కోట శామ్యూల్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, మాజీ ఎంపీపీ కోట దాసు, ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కె. నరసింహారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసంత నామినేషన్ చెల్లదంటూ ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న ఫిర్యాదుదారు నాగ పవన్ కుమార్

జి.కొండూరు: టీడీపీ మైలవరం నియోజకవర్గ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ నామినేషన్ చెల్లదంటూ ప్రస్తుతం మైలవరం నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇబ్రహీంపట్నంకు చెందిన వల్లభనేని నాగ పవన్ కుమార్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంపత్‌కుమార్‌కి శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల అఫిడవిట్‌లో ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో వసంత వెంకట కృష్ణప్రసాద్‌పై నమోదైన కేసును ప్రస్తావించలేదని, దీనిపై తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. ఆ కేసుపై వాదనలు ఇప్పటికీ నడుస్తున్న క్రమంలో ఆ కేసును ప్రస్తుత అఫిడవిట్‌లో చేర్చారన్నారు. దీనితో పాటు అతనిపై 2014లో నమోదైన కేసును ప్రస్తావించకుండా 2013లో లేని కేసుని ఉన్నట్లు ప్రస్తావించారన్నారు. వసంత వెంకటకృష్ణప్రసాద్, అతని భార్య శిరీషా పేరుతో వేసిన మొత్తం నాలుగు నామినేషన్లలో వారిచ్చిన ఏ అఫిడవిట్‌లో కూడా నోటరీ వద్ద డేటును వేయలేదన్నారు. వసంత వెంకట కృష్ణప్రసాద్ తన అఫిడవిట్‌లో వసంత టెక్స్‌టైల్స్, వసంత ట్రేడర్స్, వసంత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వసంత కోల్డ్ స్టోరేజ్, వసంత రిసార్ట్స్, వసంత హాస్పటాలిటీ సర్వీసెస్, వసంత గ్రీన్ ప్రాజెక్ట్స్ పేరుతో అప్పులు ఉన్నట్లు చూపించారు కానీ ఆస్తులుగా చూపించలేదన్నారు. వసంత వెంకటకృష్ణప్రసాద్ మైనర్‌గా ఉన్న తన కుమారుడు పేరుతో ఇన్‌కమ్‌ట్యాక్స్ ఎలా కట్టారని ప్రశ్నించారు. వసంత వెంకట కృష్ణప్రసాద్ తనతో పాటు ఆయన భార్య డైరెక్టర్లుగా ఉన్న పలు కంపెనీల ఆర్థిక వివరాలను సక్రమంగా అఫిడవిట్‌లో రాయలేదన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి వసంత వెంకట కృష్ణప్రసాద్ నామినేషన్‌ను రద్దు చేయాలని మైలవరం ఆర్‌ఓ సంపత్‌కుమార్‌కి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అయితే పరిశీలిస్తానని ఉదయం హామీ ఇచ్చిన ఆర్‌ఓ, మాట దాటవేస్తూ వసంత నామినేషన్‌ను ఆమోదించడంపై తనకు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. దీనిపై హైకోర్టుకు వెళ్లడంతో పాటు ఆర్‌ఓపై ఎన్నికల కమిషన్ సీఈఓకి ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. దీనిపై ఆర్‌ఓ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఉన్నందున ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు అన్నీ ఆమోదించామని చెప్పారు.

టీడీపీకి ఓటు వేస్తే కష్టాలు తప్పవు

ఎమ్మెల్యే తనయుడు చంటినాయన



నూజివీడు నాలుగో వార్డులో ప్రచారం చేస్తున్న మేకా వేణుగోపాల అప్పారావు

నూజివీడు: చంద్రబాబు మాయమాటలు నమ్మి టీడీపీకి ఓటు వేస్తే కష్టాలు తప్పవని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) హెచ్చరించారు. నూజివీడు నాలుగో వార్డులో శుక్రవారం రాత్రి ఆయన ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడ్డారని, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందాయని, పేదల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు, పేదలు వైద్యం చేయించుకునే ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి చెందాయని వివరించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రూ.21.15 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించామని, రమణక్కపేటలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి, నూజివీడు పట్టణంలో రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భవనాలను రూ.5 కోట్లతో నిర్మించారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రతాప్ అప్పారావు వల్లే సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, నాయకులు దామెర జోగారావు, తుమ్మూరు రాజేష్, పగడాల సత్యనారాయణ, కోటగిరి సతీష్, మాజీ కౌన్సిలర్ జొన్నాడ రామారావు, పి.రంగారావు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



చింతలనర్వ(గంపలగూడెం): చింతలనర్వలో ప్రచారం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందని చెప్పారు. పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామన్నారు. గ్రామ పార్టీ నాయకులు యనమద్ది నాగమల్లేశ్వరరావు, యనమద్ది కృష్ణయ్య, జొన్నలగడ్డ ప్రేమరాజు, సభ్యులు చెరుకు నర్సారెడ్డి, జి. చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

గణపవరంలో 20 మంది చేరిక..

గణపవరం(మైలవరం): జగన్ పాలనకు ఆకర్షితులై టీడీపీ నుంచి 20 మంది కార్యకర్తలు ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో శుక్రవారం చేరారు. వారికి పామర్తి శ్రీనివాసరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు వైఎస్సార్ సీపీ మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు గెలుపునకు కృషి చేయాలన్నారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

మైలవరం: 2024 ఎన్నికలకు సంబంధించి మైలవరం నియోజకవర్గంలో మొత్తం 25 మంది తమ నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూటినీ అనంతరం 12 మంది నామినేషన్‌లు సక్రమంగా ఉన్నాయని ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్ తెలిపారు. అభ్యర్థుల జాబితాను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నుంచి సర్నాల తిరుపతిరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి బొర్ర కిరణ్, టీడీపీ నుంచి వసంత వెంకట కృష్ణప్రసాద్, బహుజన సమాజ్‌వాది పార్టీ నుంచి గాలంకి వెంకటేశ్వరరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి గుడిసె రాంబాబు, తెలుగు రాజ్యాధికార సమితి నుంచి చింతమాల నవీన అంబేడ్కర్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి ఓర్సు రామారావు, జాతీయ జనసేన పార్టీ నుంచి పోలకంపల్లి అనిల్‌కుమార్ నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని చెప్పారు. స్వతంత్ర అభ్యర్థులుగా వల్లభనేని నాగపవన్ కుమార్, వేములపల్లి పృథ్వీ, నంబూరు పుల్లారావు, కొలికపోగు వెంకటరావు నామినేషన్లు ఉన్నాయన్నారు. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం ఫైనల్ జాబితా ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

తిరువూరు బరిలో 13 మంది అభ్యర్థులు

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ల పరిశీలన అనంతరం 13 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. నల్లగట్ల స్వామిదాసు (వైఎస్సార్ సీపీ), కొలికపూడి శ్రీనివాసరావు (టీడీపీ), లక్కెపోగు వందనకుమార్ (బీఎస్పీ), లాం తాంతియాకుమారి (కాంగ్రెస్), కొలికపోగు శ్రీను (జాతీయ జనసేన పార్టీ), చిలపరపు వెంకటేశ్వరరావు (భారత చైతన్య యువజన పార్టీ), బొల్లిపోగు నాగరాజు (జనవాహిని), శీలం రాజా(లిబరేషన్ కాంగ్రెస్) పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా బీమాల అనూష, కూరపాటి కృష్ణయ్య, కొర్రపాటి రవీంద్రబాబు, కొలికపోగు వెంకటరావు, వాసం మెహర్‌బాబా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 29న అభ్యర్థులకు ఎన్నికల సంఘం నియమావళి ననుసరించి గుర్తులు కేటాయిస్తామని రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు.

మూడు నామినేషన్లు తిరస్కరణ

నూజివీడు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై.భవానీశంకరి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. 15 మంది అభ్యర్థులకు సంబంధించి 28 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో స్వతంత్ర అభ్యర్థి దురిశేటి అశోక్‌కుమార్, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి పిన్నిబోయిన ప్రభుకుమార్‌లతో పాటు టీడీపీ డమ్మీ అభ్యర్థి కొలుసు నితిన్‌కృష్ణ నామినేషన్లను తిరస్కరించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి, కాంగ్రెస్ అభ్యర్థి మరీదు కృష్ణ, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి సోము వెంకట పూర్ణచంద్రరావు, స్వతంత్ర అభ్యర్థులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ముద్దరబోయిన వెంకట రాధిక, కొలుసు కమలలక్ష్మి, పాము రవీంద్రనాథ్, మందలపు శ్రీనివాసరావు, బొట్ల శివ సత్యనారాయణ, చలిగంటి వెంకటేష్, ఆముదాల ఇస్సాక్‌ల నామినేషన్లను ఆమోదించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. తిరువూరు రోడ్డు, పెద్దగాంధీబొమ్మ, చిన్నగాంధీబొమ్మ సెంటర్, బ్యాంకు స్ట్రీట్, ఎంప్లాయిస్ కాలనీ, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, జంక్షన్ రోడ్డు, అమ్మవారితోట, మొఘల్ చెరువు ప్రాంతం, ఆర్‌ఆర్‌పేట, ఆటోనగర్, అయ్యప్పస్వామి గుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ శ్రీనివాసనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాంకో కాలనీ ఏరియా, జీబీజీ స్కూల్ ఏరియా, మురళీకృష్ణ టింబర్ డిపో ఏరియా, రావూరి వెంచర్స్ అపార్ట్‌మెంట్స్ ఏరియా, వెంకయ్య స్వామి టెంపుల్ రోడ్డు, సాయిపురం కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ, ప్రభుత్వ కార్యాలయాల ఏరియా, వన్ సెంటర్ ఏరియా, అనిల్ క్యాస్ట్ అపార్ట్‌మెంట్ ఏరియా, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఏరియా, విజేత సూపర్ మార్కెట్ ఏరియా, పంట కాలువ రోడ్డు, శ్రీనివాస నగర్, కోయ పేట ఏరియా, బైపాస్ రోడ్డు ఏరియా, అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు ఏరియా, అమ్మ కన్వెన్షన్ అపార్ట్‌మెంట్ ఏరియా, శ్రీశైలం కాలనీ ఏరియాలలో శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

మారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఉదయం పంబలసేవ, అమ్మవారి కథాగానం, బియ్యం కొలబట్టుట తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు.

నేడు అన్నసమారాధన

మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆఖరి రోజు సందర్భంగా గ్రామస్తులు, భక్తుల సహకారంతో శనివారం ఉదయం 10 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ ఈఓ వై. సీతారామయ్య తెలిపారు.

టెన్త్ టాపర్ మనస్వికి ప్రోత్సాహకం



రమణక్కపేట(ముసునూరు): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థిని మనస్వి స్టేట్ ఫస్ట్ సాధించడం అభినందనీయమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్కిరెడ్డిగూడెం బ్రాంచ్ మేనేజర్ ఆర్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. పది పరీక్ష ఫలితాల్లో 599 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచిన రమణక్కపేట బాలిక ఆకుల వెంకట నాగసాయి మనస్విని శుక్రవారం ఎస్‌బీఐ తరఫున ఆయన ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బాలికను ఘనంగా సత్కరించి, తల్లిదండ్రులు నాగ వరప్రసాద్, నాగ శైలజలను అభినందించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో బ్యాంక్ నగదు అధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కవాతు నిర్వహించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నంలో శుక్రవారం జరిగిన కవాతులో ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఓటర్లలో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కుల,మతాలు, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వినియోగించుకోవాలని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు శాఖ ప్రజలకు పటిష్ట భద్రత కల్పిస్తోందని వివరించారు. సీఐ ఎం.సత్యనారాయణ, ఎస్ఐ పాపారావు, సివిల్, సాయుధ పోలీస్ బలగాలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో ఎస్ఐ సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఈ కవాతు నిర్వహించామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తవేరియా నాయక్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ముసునూరు: బంధువులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన బొబ్బిలి రవికుమార్ తన భార్య రూపతో కలిసి ముక్కొల్లుపాడులో బుధవారం వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో ముసునూరులో ఉన్న తన చెల్లి యలమర్తి వరలక్ష్మి, బావ రంగారావు ఇంటికి వెళ్లారు. వెళ్లగానే చెల్లెలు మీరు ఎందుకు వచ్చారు? మీరు రావడం వల్ల నాభర్త నన్ను కొడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంతకు ముందే చిన్న అన్నయ్య వచ్చి ఇచ్చిన అరటి పండ్లను బయట పారవేశాడని చెప్పింది. ఇంతలో వచ్చిన రంగారావు, రవికుమార్ తెచ్చిన స్వీట్ ప్యాకెట్ కూడా బయటపారవేసి వారి ఎదుటే భార్యను కొట్టడం ప్రారంభించాడు. అడ్డుపడిన రవికుమార్ తలపై ఇనుప రాడ్డుతో కొట్టాడు. రంగారావు తల్లి రూపను కర్రతో కొట్టింది. గాయాలపాలైన రవికుమార్, రూప నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.